శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు

- ముప్కాల్–కొత్తపల్లి రహదారి వెడల్పు పనులకు రూ.3.85కోట్లు మంజూరు
- పూర్తికావొస్తున్న కల్వర్టుల నిర్మాణాలు


ముప్కాల్ మండల కేంద్రంలో కొనసాగుతున్న కల్వర్టు పనులు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రం నుంచి కొత్తపల్లి మీదుగా పెద్దవాగు రోడ్డు వరకు నిర్మిస్తున్న రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రభుత్వం రూ.3.85 కోట్ల నిధులను గత నెలలో మంజూరు చేసింది. అదే నెలలో పనులకు రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పది రోజుల్లోనే పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డుకిరువైపులా తవ్వకాలు చేపట్టి కంకర, డస్ట్ కూడ వేశారు. మూడు కల్వర్టుల పొడగింపు అవసరమైతే వాటిని కూడ పూర్తి చేశారు. వర్షాలు తగ్గగానే తారు వేసే అవకాశం ఉంది. పనుల వేగంగా సాగడంపై ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కానీ రోడ్డు మధ్యలో మర్రి చెట్టు వద్ద గుండె వాగుపై, కొత్తపల్లి ప్రవేశం వద్ద లక్ష్మి కాలువపై వంతెనల సంగతి మరిచిపోయారేమోనని ప్రజలు అంటున్నారు. ఆ రోడ్డు వంతెనలు ఇరుకుగా ఉండటంతోపాటు, శిథిలావస్థలో ఉన్నాయి. వాటి పనులు ఇప్పటి వరకు ప్రారంభించలేదు. వాటిని కూడ కొత్త వంతెనలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బాల్కొండ, ముప్కాల్ మండల పరిధిలో..

బాల్కొండ, ముప్కాల్ మండల పరిధిలో నెల రోజుల క్రితం మంజూరు చేసిన రోడ్డు విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. బాల్కొండ మండలం కేంద్రం నుంచి కిసాన్‌నగర్ వరకు నాలుగు లైన్ల రోడ్ల కోసం ప్రభుత్వం రూ.2.4 కోట్లు, పాత జాతీయ రహదారి 44 నుంచి బాల్కొండ మండల కేంద్రంలో మల్లన్నగుట్ట వరకు రూ.1.4 కోట్లతో తారు రోడ్డు, కిసాన్‌నగర్ నుంచి నాగాపూర్ వరకు రూ.1.4 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు, ముప్కాల్ మండల కేంద్రంలో నుంచి దూలగుట్ట వరకు రూ. 1.15 కోట్లు, ముప్కాల్ మండల కేంద్రంలో నాలుగు లైన్‌ల రోడ్లు, సెంట్రల్ లైటింగ్ పనుల కోసం రూ.2.10కోట్ల నిధులను గత నెలలోనే ప్రభుత్వం మంజూరు చేసింది. అన్ని పనులను అదే నెలలో శంకుస్థాపన చేశారు. అన్ని పనులు వేగంగా సాగడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు దెబ్బతినకుండ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



వర్నిలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు.. బాల్కొండలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న బీజేపీ నేతలు

ఆర్మూర్‌టౌన్/బోధన్ రూరల్/వర్ని/బాల్కొండ: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తామని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పేర్కొన్నారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాలోని పలు మండలాల్లో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 11వ రోజు కొనసాగింది. బోధన్, వర్నిలో కొనసాగుతున్న సమ్మె శిబిరంలో సీపీఎం జిల్లా కార్యదర్శి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు రమేష్‌బాబు పాల్గొని, మద్దతు తెలిపారు. ఐసీడీఎస్ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అంగన్‌వాడీ ఉద్యోగులను అవమానించే విధంగా మాట్లాడారని, వెంటనే వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, దుష్ప్రచారాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బాల్కొండలో అంగన్‌వాడీల సమ్మెకు బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. నాయకులు నాగుపల్లి రాజేశ్వర్, అంబటి నవీన్, నర్సయ్య, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

27న బాన్సువాడలో జాబ్ మేళా

రుద్రూర్/వర్ని: కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 27న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో పీబీఆర్ మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు వర్ని, కోటగిరి మండలాల బీఆర్ఎస్ నాయకులు, వర్ని మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు వెలగపూడి గోపాల్ పేర్కొన్నారు. ఈమేరకు వారు గురువారం వేర్వేరుగా ఆయా మండలాల్లో విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. డిప్లొమా, బీటెక్, బీఫార్మసీ, ఐటీఐ, నర్సింగ్, అగ్రికల్చర్, ఎంబీఏ తదితర కోర్సులు చదివిన యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

మహనీయుల జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని డీఐఈవో రఘురాజ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఇన్‌స్పైర్, ఇగ్నిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో 'వ్యక్తి అభివృద్ధి చెందితే దేశ అభివృద్ధి' అనే అంశంపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఫౌండేషన్ శిక్షకులు రజింత్, రాము, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ బకాయిలు చెల్లించాలి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్మికులకు 8 నెలల పీఆర్సీ బకాయిలు, రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో గురువారం మున్సిపల్ కార్మికులు యూనియన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి సమ్మె ప్రారంభించారు. అధికారులు, పాలకవర్గం సభ్యులు స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వెంకట్ కోరారు. మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత



రుద్రూర్: తమ సమస్యల పరిష్కారానికి ఈ నెల 25నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు ఆశావర్కర్లు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం రుద్రూర్ మండల వైద్యాధికారిని ఆయేషా సిద్దిఖికి వారు సమ్మె నోటీస్ అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, వాణి, భూలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

వాటర్‌ట్యాంక్‌ను వేరే ప్రాంతంలో నిర్మించాలి



వర్ని: చందూర్ మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో పాత బస్టాండ్‌ను కూల్చివేసిన ప్రాంతంలో వాటర్ ట్యాంక్‌ను నిర్మించొద్దని, ఇతర ప్రాంతాల్లో నిర్మించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గురువారం ఎంపీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. పాత బస్టాండ్‌ను కూల్చివేసిన ప్రాంతంలో కొత్త బస్టాండ్ లేదా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని కోరారు. నాయకులు మహేష్, శివకిరణ్ పాల్గొన్నారు.

జీవనభృతి అందించాలి



బాల్కొండ: బీడీ కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండ రూ.4వేల జీవన భృతిని అందించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న డిమాండ్ చేశారు. ఈమేరకు ముప్కాల్‌లో గురువారం యూనియన్ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, తహసీల్దార్ వనజరాణికి వినతిపత్రం అందజేశారు. నాయకులు నజీర్, విజయ, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆరోపణలు



కమ్మర్‌పల్లి: నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారని మండలంలోని హాసకొత్తూర్ గ్రామ బీఆర్ఎస్ నేతలు అన్నారు. గ్రామంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు తమ ఉనికి కోసం రాజకీయాలు అపాదిస్తున్నారని విమర్శించారు. నాయకులు ఏనుగు రాజేశ్వర్, గడ్డం శ్రీధర్, కిరీటి, నోముల నరేందర్‌రెడ్డి, మేడం రమేష్ పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఆఫీస్‌లో చోరీ

మాక్లూర్: మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చొరబడి, 38 బ్యాటరీలను అపహరించారని ఎస్సై సుధీర్‌రావు గురువారం తెలిపారు. బీఎస్ఎన్ఎల్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. విచారణలో భాగంగా సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి


మాణిక్‌బండార్ వద్ద రాస్తారోకో చేస్తున్న నేతలు

మాక్లూర్/ఎడపల్లి/నవీపేట: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం నవీపేటలో, జాన్కంపేట్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు, మాక్లూర్ మండలంలోని మాణిక్‌బండార్ చౌరస్తా 63వ నంబర్ జాతీయ రహదారిపై ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. ప్రమోద్ మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సరికెల పోశెట్టి, మురళీకృష్ణ, మంద ప్రభాకర్, రాజేష్, రొడ్డ ప్రవీణ్, గంగాధర్, రమేష్, యమున, పద్మ, సాయన్న, బాబు, నర్సయ్య, సుధ, పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి


ఆర్మూర్‌లో నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు

సాక్షి నెట్‌వర్క్, నిజామాబాద్: భారత స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నేత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి పద్మశాలి సంఘ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో గురువారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పద్మశాలీలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈసందర్భంగా పలు మండలాలు, గ్రామాల్లో బాపూజీ విగ్రహం, చిత్రపటాలకు వారు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఆయన చేసిన పోరాటాలు, సేవలను కొనియాడారు. వివిధ మండలాల పద్మశాలీ సంఘ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


మోస్రాలో..


ముప్కాల్‌లో..


బోధన్‌లో..

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి


భీమ్‌గల్‌లో మాట్లాడుతున్న అధికారులు

రుద్రూర్/వర్ని: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు ఇబ్బంది కలుగకుండా, వారి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని సీపీ సత్యనారాయణ సిబ్బందిని ఆదేశించారు. రుద్రూర్ సర్కిల్ కార్యాలయంతో పాటు కోటగిరి, రుద్రూర్, వర్ని పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, ఘర్షణలకు దారితీసే చర్యలు, సంఘవిద్రోహ చర్యలకు పాల్పడితే సహించేది లేదని అన్నారు. బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ జయేష్‌రెడ్డి, ఎస్సైలు ఉన్నారు.

భీమ్‌గల్‌లో కలెక్టర్, సీపీ పర్యటన

భీమ్‌గల్: కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ సత్యనారాయణ గురువారం భీమ్‌గల్‌లో పర్యటించారు. ఎన్నికలు నిర్వహించే కార్యాలయాలను, ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలను సందర్శించారు. ఎన్నికల నిర్వాహణకు కార్యాలయాల్లో సౌకర్యాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు డీసీపీ జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కమ్మర్‌పల్లి: మహిళా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కమ్మర్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రేగుంట దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన మండల మహిళా సమాఖ్య వార్షిక మహాజన సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో మహిళా సంక్షేమ పథకాలు విస్తృతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఏపీఎం కుంట గంగాధర్ మాట్లాడుతూ.. కమ్మర్‌పల్లి మండల సమాఖ్య ఆదర్శ మహిళా సమాఖ్యగా ఎంపిక కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ. 71 లక్షల సామాజిక పెట్టుబడి కింద ఇవ్వగా దానిని రూ. 1.73 కోట్లకు పెంచడం జరిగిందని అన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు లావణ్య, కార్యదర్శి రోజారాణి, కోశాధికారి నస్రీన్ ఉపాధ్యక్షురాలు గంగజమున, సహకారదర్శి లక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

బోధన్‌టౌన్(బోధన్): వినాయక చవితి, మిలాద్–ఉన్ నబీ పండుగలు ఒకే రోజు వస్తున్నాయని, ఇరువర్గాల ప్రజలు పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఏసీపీ కిరణ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో గురువారం ముస్లింలతోతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రెండు పండుగలు ఒకే రోజు రావడంతో ఇరు వర్గాల ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మిలాద్ ఉన్‌నబీ ర్యాలీ హైదరాబాద్‌లో 1వ తేదీన నిర్వహిస్తున్నారని, మీరు కూడ ఇక్కడ 1వ తేదీన నిర్వహించాలన్నారు. దీంతో ముస్లింలు 28న ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు ర్యాలీ నిర్వహిస్తామని, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని తెలిపారు. మరోసారి చర్చించి ఈ విషయంపై కొలిక్క వస్తామని ఏసీపీ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు


డొంకేశ్వర్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


సుర్భిర్యాల్‌లో బియ్యాన్ని అందజేస్తున్న నాయకులు

డొంకేశ్వర్/పెర్కిట్/బోధన్‌రూరల్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా ఆయా మండలాల్లోని వినాయక మండపాల వద్ద గురువారం ప్రత్యేక పూజలు, అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. డొంకేశ్వర్‌లో సత్య (కట్టె) గణపతిని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి రజిత దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ చాయచందు, సర్వసమాజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలకు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పది క్వింటాళ్ల బియ్యాన్ని వితరణ చేశారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ రాజేశ్వర్‌రెడ్డి నిర్వాహకులకు బియ్యాన్ని అందజేశారు.

సంక్షిప్తం

స్వర్గరథానికి విరాళం



డొంకేశ్వర్: మండలంలోని చిన్నయానం గ్రామానికి స్వర్గయాత్రరథం కోసం ముస్కు రమణారెడ్డి రూ. 2.40లక్షలు విరాళం అందజేశారు. సర్పంచ్ సుస్మిత శ్రీనివాస్, సాగర్, దశరత్, భూమన్న, రాజు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపిక

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు లాస్య, అంకిత జిల్లా స్థాయి సైన్స్ కాంగ్రెస్‌లో ఉత్తమ ప్రతిభతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్యామల బాయి తెలిపారు. గురువారం విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు.

ఎమ్మెల్సీని కలిసిన సొసైటీ చైర్మన్

నవీపేట: పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదం పొందడంతో గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ కవితను నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

దాతకు సన్మానం

నవీపేట: నవీపేట వీడీసీకి స్వర్గయాత్రరథాన్ని వితరణ చేసిన ఉప సర్పంచ్ కరిపె మల్లేష్‌ను బీఆర్ఎస్ నాయకులు గురువారం సన్మానించారు. ఎంపీపీ సంగెం శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్‌రావ్, అబ్బన్న పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

వర్ని: ప్రజలు తడి చెత్తను పొడి చెత్తను వేరు చేసి, జీపీ ట్రాక్టర్‌లో వేయాలని చందూర్ సర్పంచ్ సాయిరెడ్డి ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలో గురువారం ఆయన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సంఘాల మహిళలకు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉప సర్పంచ్ శేఖర్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి సాయిలు పాల్గొన్నారు.

స్పీకర్‌కు మద్దతుగా తీర్మానం



వర్ని: మోస్రాలో గౌడ సంఘం సభ్యులు రాబోవు ఎన్నికల్లో స్పీకర్ పోచారంకు మద్దతు ప్రకటిస్తూ గురువారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. స్పీకర్‌కు తీర్మానపత్రాన్ని అందజేశారు. నాయకులు పిట్ల శ్రీరాములు, హనుమంత్‌రెడ్డి, వంగ సాయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ భూమి కబ్జాపై ఫిర్యాదు

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఏఆర్‌పీ క్యాంపులోని ఉన్నత పాఠశాల భూమిని కబ్జా చేశారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం స్కూల్ భూమిని రక్షించాలని కోరుతూ వారు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కబ్జాకు పాల్పడిన వారిపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

బాల్కొండ: రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు బాల్కొండ కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులు లలిత, నవ్య, నిశిక, వర్షినిలు ఎంపికైనట్లు ఎస్‌వో భవాని గురువారం తెలిపారు. వీరు జిల్లా జట్టు తరపున వరంగల్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం



కమ్మర్‌పల్లి: పార్లమెంటులో మహిళా బిల్లు ఆమోదం పొందడంతో మండల కేంద్రంలో మహిళా సంఘాల సభ్యులు గురువారం ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు కుంట గంగారెడ్డి, లావణ్య, రోజారాణి, నస్రీన్ పాల్గొన్నారు.


రెండో విడత గొర్రెల పంపిణీ

వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్, రామన్నపేట్ గ్రామాలలో రెండో విడత గొర్రెలను లబ్ధిదారులకు గురువారం బీఆర్ఎస్ నాయకులు, వెటర్నరీ అధికారులు పంపిణీ చేశారు. సర్పంచులు ఎడ్ల రాజేశ్వర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఎంపీటీసీ రవి, ఉపసర్పంచ్ రిక్కమధు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రికి తరలిన భక్తులు

మాక్లూర్: మండలంలోని రాంచంద్రపల్లి గ్రామస్తుల్ని గురువారం సర్పంచ్ కటుకం వెంకన్న యాదగిరిగుట్ట దర్శనానికై ప్రత్యేక బస్సులో తీసుకెళ్లారురు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రత్యేక బస్సులను సమకూర్చగా ప్రజలు తరలివెళ్లారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



నందిపేట్: మండల కేంద్రంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు సృజన, ప్రిన్సిపల్ శాంతి కుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సాయిఆలయంలో అన్నదానం

బోధన్‌రూరల్: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో గురువారం ఎమ్మెల్యే షకీల్, అయేషా వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ అయేషా పాతిమా (దంపతులు) ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు అన్నదానం నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎండీఎం కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



బోధన్: మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపునూరు చక్రపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలో కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం రెండోరోజు కొనసాగింది. ఈసందర్భంగా కార్మికులు ఆర్డీవో ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. చక్రపాణి మాట్లాడుతూ.. కార్మికులకు పెంచిన వేతనాన్ని ఏప్రిల్ 2022 నుంచి అమలు చేయాలని తెలిపారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో గురువారం ఎండీఎం కార్మికులు రెండోరోజు సమ్మెలో భాగంగా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎండీఎం కార్మికులు మాట్లాడుతూ.. నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా ఒక విద్యార్థికి రూ. 25 స్లాబ్ రేటు ఇవ్వాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి



ఎడపల్లి(బోధన్): గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజిత యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించి, పోషకాహారాన్ని పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రసూల్‌బీ, ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీవో గోపాలకృష్ణ తదితరులు ల్గొన్నారు.

విద్యారంగంలో మెరుగైన ఫలితాలు సాధించాలి



కోటగిరి (రుద్రూర్): మండలంలో విద్యారంగంలో ఆశించిన ఫలితాలు రావడం లేదని కోటగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కోటగిరి మండల సర్వసభ సమావేశం గురువారం ఎంపీపీ వల్లెపల్లి సునీతశ్రీనివాస్‌రావ్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని, మెరుగైన ఫలితాలు సాధించాల్సిన అవసరం ఉందని సభ్యులు వాఖ్యానించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గూర్చి చర్చించారు. అధికారులు మనోహర్‌రెడ్డి, ప్రభాకర్, సాయిలు, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – అష్ట దిగ్బంధనం - 1.00; ఖుషి - 3.55
సప్త సాగరాలు దాటి - 7.20
7/జీ బృందావన కాలనీ - 10.25

స్క్రీన్-2 – మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి -10.00, 1.10, 4.20, 7.30, 10.40

స్క్రీన్-3 – 7/జీ బృందావన కాలనీ - 10.25
మట్టి కథ - 4.40; బీటర్ - 10.00
మార్క్ ఆంథోని - 6.50

స్క్రీన్-4 – జవాన్(తెలుగు)- 11.00, 2.35,
జవాన్(హిందీ)- 6.10, 9.45